

విద్యుత్ భద్రతకు ప్రత్యేక చర్యలు..
ట్రాన్స్‌ఫార్మర్ యార్డులో శుభ్రత పనులు

తూప్రాన్ (ప్రజాజ్యోతి) నవంబర్ 10:

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని తూప్రాన్ ఏ ఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుజంగారావు ట్రాన్స్‌ఫార్మర్ యార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

వివరాలు 2లో

సంగారెడ్డి మెదక్

బుధవారం 11 నవంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:09

ట్రిపుల్ ఆర్ భూములు కోల్పోతున్నరైతులకు న్యాయమైన పరిహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



నవంబర్ 10 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలు, తూప్రాన్ మండలం లో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ కార్యాలయం నుంచి రీజినల్ రింగ్ రోడ్డు అథారిటీ అధికారులతో గూగుల్ మీట్ కార్యక్రమం నిర్వహించారు.

వివరాలు 2లో





రూ.500 నోటుకు మంగళం పాడాల్సిందేనా..!

- చంద్రబాబు ప్రతిపాదనతో దేశవ్యాప్తంగా కొత్త చర్చ

- అవినీతికి అడ్డుకట్ట పడుతుందా..?

సామాన్యుడి జేబుకు చిల్లు పడుతుందా..?

నవంబర్ 10, ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం

ఒకప్పుడు పెద్ద నోట్ల రద్దు.. ఇప్పుడు రూ.500 నోటు రద్దు చర్చ! దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారిన రూ.500 నోటును కూడా చలామణి నుంచి తొలగించాలన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపాదన దేశవ్యాప్తంగా ఆసక్తికర చర్చకు తెరలేపింది. ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన ఇటీవల చేసిన ఈ సూచనతో మరోసారి నోట్ల రద్దు అంశం తెరపైకి వచ్చింది.

వివరాలు 2లో

రూ.500 నోటుకు మంగళం పాడాల్సిందేనా..!

మొదటిపేజీ తరువాయి

అవినీతి, నల్లధనం, ఎన్నికల్లో ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలంటే పెద్ద నోట్ల అవసరాన్ని తగ్గించాలన్న వాదన ఒకవైపు వినిపిస్తుండగా.. అదే జరిగితే సామాన్యుడి రోజువారీ ఆర్థిక లావాదేవీల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న మరోవైపు వ్యక్తమవుతోంది.

డిజిటల్ విప్లవానికి మరో అడుగా?

దేశంలో డిజిటల్ చెల్లింపులు గణనీయంగా విస్తరించాయి. చిన్న దుకాణం నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు యూపీఐ చెల్లింపులు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో అధిక విలువ కలిగిన కరెన్సీ నోట్లను తగ్గించి డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తే ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందన్న అభిప్రాయం బలపడుతోంది. అయితే డిజిటల్ చెల్లింపులు అందరికీ అందుబాటులోకి వచ్చాయా? గ్రామీణ ప్రాంతాల్లో నగదుకు ప్రత్యామ్నాయం సిద్ధమైందా? అన్నది కీలక ప్రశ్నగా మారింది.

రైతు నుంచి చిరు వ్యాపారి వరకు..

గ్రామీణ భారతంలో ఇప్పటికీ నగదే ప్రధాన ఆర్థిక ఆధారం. వ్యవసాయ కూలీలకు వేతనాలు, రైతుల కొనుగోళ్లు, చిన్న వ్యాపారుల లావాదేవీలు.. ఇలా అనేక అవసరాలకు రూ.500 నోటు కీలకంగా ఉంది. ఈ నోటును రద్దు చేస్తే నగదు మార్పిడి, చిల్లర సమస్యలు, వ్యాపార లావాదేవీలపై ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

నోట్ల రద్దుతోనే అవినీతి అంతమవుతుందా?

పెద్ద నోట్లను రద్దు చేస్తే అక్రమ నగదు నిల్వలకు అడ్డుకట్ట పడుతుందన్న వాదన ఉన్నప్పటికీ అవినీతి కేవలం నగదు రూపంలోనే కొనసాగడం లేదు. బినామీ ఆస్తులు, బంగారం, భూముల



రూపంలోనూ అక్రమ సంపద కూడబెట్టే అవకాశాలున్నాయి. అందువల్ల నోట్ల రద్దుతో పాటు అవినీతి నిరోధక చర్యలు, ఆర్థిక లావాదేవీలపై పర్యవేక్షణ, ఎన్నికల ఖర్చుల్లో పారదర్శకత కూడా అవసరమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

2016 చేదు అనుభవాలు పునరావృతమవుతాయా?

2016 నవంబర్‌లో పెద్ద నోట్ల రద్దు సమయంలో బ్యాంకులు, ఏటీఎంల వద్ద ప్రజలు పడిన ఇబ్బందులు ఇంకా మరిచిపోలేదు. నగదు కొరతతో చిరు వ్యాపారాలు, సామాన్యుల జీవన విధానంపై ప్రభావం పడింది. ఇప్పుడు మళ్లీ రూ.500 నోటు రద్దు ప్రతిపాదన రావడంతో అలాంటి పరిస్థితులు పునరావృతమవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

దేశ ప్రయోజనమా.. ప్రజల ఇబ్బందులా?

దేశ ఆర్థిక వ్యవస్థను పారదర్శకంగా మార్చడం, అవినీతిని నియంత్రించడం ఎంత అవసరమో.. ప్రజల రోజువారీ అవసరాలకు ఇబ్బందులు కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యం. చంద్రబాబు సూచనతో మొదలైన ఈ చర్చలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. అయితే ఇది ప్రస్తుతానికి ఒక ప్రతిపాదన మాత్రమే. పెద్ద నోట్ల రద్దు నిజంగా ఆర్థిక సంస్కరణలకు బాటలు వేస్తుందా? లేక సామాన్యుడికి మరోసారి కష్టాలు తెస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.అవినీతిపై పోరాటం జరగాలి.. కానీ ఆ పోరాటంలో సామాన్యుడు ఇబ్బందులు పడకూడదు. రూ.500 నోటు భవితవ్యంపై చర్చ కంటే.. దేశ ఆర్థిక వ్యవస్థలో సామాన్యుడి భవిష్యత్తు ఎలా ఉండబోతోందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న!

విద్యుత్ భద్రతకు ప్రత్యేక చర్యలు.. ట్రాన్స్‌ఫార్మర్ యార్డులో శుభ్రత పనులు

మొదటిపేజీ తరువాయి

యార్డు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, క్రీపర్స్ (తీగలను) పూర్తిగా తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు.విద్యుత్ పరికరాల పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు భద్రతా ప్రమాణాలు పాటించడం ఎంతో అవసరం. విద్యుత్ ప్రమాదాల నివారణకు ఇలాంటి ముందస్తు చర్యలను నిరంతరం కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



ట్రిపుల్ ఆర్ భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..

భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, భూముల వివరాలు, యాజమాన్య హక్కులు, రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన భూ యజమానులను గుర్తించాలని





తెలిపారు.భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లింపులో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం పరిహారం అందించి, వారి ప్రయోజనాలను కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి గఫర్ , సంబంధిత అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక అధికారులు

ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఎల్ నీ నో ప్రభావం వల్ల సంక్షేమ వసతి గృహాలలో త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి, మౌలిక సదుపాయాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

నవంబర్ 10 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్







అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులతో సమీక్షించారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, వసతి సౌకర్యాలు, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను తరచుగా తనిఖీ చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతి గృహాల్లో నిరంతర తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నట్లయితే వెంటనే గుర్తించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి బోర్లు వేయాల్సిన అవసరం ఉన్న వసతి గృహాలకు సంబంధించి సంబంధిత అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే పంపించాలని ఆదేశించారు.విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అధికారులు తరచుగా హాస్టళ్లను సందర్శించి, సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.రేపటి నుంచి ఎల్ నీ నో ను సమర్థవంతఎదుర్కోవడానికి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహనతో కూడిన గ్రామసభలు నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా విద్యాధికారి రాజు,జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


765-డి, 765-డిజి రోడ్ల నిర్మాణంలో భూములు కోల్పోతున్న

బాధితులకు పరిహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

నవంబర్ 10 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

765 డి765 డిజి రోడ్ల నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులకు పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జాతీయ రహదారుల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రామాయంపేట నుంచి సిద్దిపేట పరిధిలో ఉన్న 765-డి, 765-డిజి రోడ్ల నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులు, భూ యజమానులకు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం తగిన నష్టపరిహారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.రోడ్ల నిర్మాణం కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలో బాధితులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని, భూముల సర్వే, రికార్డుల పరిశీలనను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.భూములు కోల్పోతున్న బాధితుల వివరాలను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిహారం చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలనిసూచించారు.ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులతో పాటు భూములు కోల్పోతున్న రైతులు, బాధితుల ప్రయోజనాలను కూడా పరిరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు.....

కొల్చారం,నవంబర్ 10(ప్రజా జ్యోతి)

ఆదిశక్తి పరాశక్తి శ్రీ రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటే భక్తులందరికీ సకల శుభాలు కలుగుతాయని పాల్వంచ మంగమ్మ సత్యనారాయణ గౌడ్, మనీషాదుర్గ ప్రసాద్ గౌడ్ దంపతులు అన్నారు. కొల్చారం మండల కేంద్రంలోని శ్రీ రేణుక మాత మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొల్చారం గ్రామానికి చెందిన పాల్వంచ మంగమ్మ సత్యనారాయణ గౌడ్, మనీషాదుర్గ ప్రసాద్ గౌడ్ దంపతులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు పులుగుర్త నాగరాజు శర్మ వేద మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దంపతులు అమ్మవారిని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, రామా గౌడ్, కృష్ణ గౌడ్ (కిట్టు), మౌనిక, సురేఖ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



కొల్చారం మండలంలో నేటి నుంచి గ్రామ సభలు.....

- ఎంపీడీవో రఫీ ఉన్నిసా బేగం..

కొల్చారం, నవంబర్10(ప్రజా జ్యోతి)

కొల్చారం మండలంలో నేటి నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాలలో ఎల్ ని నో ప్రభావం, వర్షా బావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. నీటి వృధా అరికట్టడం, ఇంకుడు గుంతల నిర్మాణం, వి వి జి రామ్ జి పథకంపై ప్రజలకు వివరిస్తామని తెలిపారు. మొదటిరోజు వెంకటాపూర్, వసురం తండాలో గ్రామసభ నిర్వహిస్తామని తెలిపారు.



రహదారులపై ధాన్యం ఆరబెట్టవద్దు.. ప్రమాదాలకు తావివ్వొద్దు

- రైతులు సురక్షిత ప్రదేశాలను వినియోగించుకోవాలి

- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

నవంబర్ 10

రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.ధాన్యం చుట్టూ రాళ్లు పెట్టడం, నల్లటి పాలిథిన్ కవర్లతో కప్పడం వల్ల ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు వాటిని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వెల్లడించారు.రహదారులపై ధాన్యం ఆరబెట్టడం ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారుతుందని స్పష్టం చేశారు. రైతులు రహదారులను వినియోగించకుండా గ్రామ పంచాయతీ ప్రాంగణాలు, ఖాళీ స్థలాలు లేదా రహదారులకు దూరంగా ఉన్న సురక్షిత ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు.చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, రైతులు తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతను కూడాదృష్టిలోఉంచుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాల నివారణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.



ఓటరు జాబితాలో పేరు గల్లంతైన అర్హులైన ఓటర్లకు మరో అవకాశం

- అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్

నవంబర్ 10 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)-2026లో భాగంగా గైర్హాజరు వలస వెళ్లిన మరణించిన డూప్లికేట్లా గుర్తించి, ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు చేర్చని అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.మెదక్ పట్టణంలోని





దయారాలో ఎస్ ఐ ఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్లు తమ వివరాలతో కూడిన ఎలక్ట్రోరల్ ఫారాలను తిరిగి పూరించి, సంబంధిత బి ఎల్ ఓకు సమర్పించాలన్నారు.గైర్హాజరు, వలస, మరణం, డూప్లికేట్గా గుర్తించినప్పటికీ ఎలక్ట్రోరల్ ఫారాలు అందని ఓటర్ల బూత్వారీ జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన బహిరంగ ప్రదేశాల్లో మరోసారి ప్రదర్శించడం జరుగుతుందన్నారు.ఓటరు నివాసం మారకుండా అదే ప్రాంతంలో ఉన్నట్లయితే, గతంలో ఎలక్ట్రోరల్ ఫారం సమర్పించకపోవడానికి గల కారణాలను పేర్కొంటూ, నిర్దేశిత అనుబంధం-బి ప్రకటనతో పాటు పూర్తి చేసిన, సంతకం చేసిన ఫారాన్ని సంబంధిత ఈ ఆర్ ఓ/ఏ ఈ ఆర్ ఓ/బి ఎల్ ఓకు స్వయంగా (లేదా) కుటుంబంలోని వయోజన సభ్యుల ద్వారా అందజేయవచ్చన్నారు.అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడడంతో పాటు, డూప్లికేట్ ఓటరు నమోదుకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి..

టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్.

టేక్మాల్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి)

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ఆందోల్ నియోజకవర్గంలో త్వరలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు.నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

జాబ్ మేళా పూర్తి వివరాలు

తేదీ ఉ సమయం నవంబర్ 15, 2026 (ఆదివారం) ఉదయం 10:00 గంటలకు. చౌటకూర్ మండల పరిధిలో సుల్తాన్ పూర్ జేఎన్టీయూ కళాశాల నిర్వహించబడుతుందన్నారు. విద్య అర్హతలు 10వ తరగతి లేదా అంతకంటే పై చదువులు చదివిన, 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతీ యువకులు (మహిళలు ఉ పురుషులు) అర్హులు. ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలలో నియమకాలు ఉంటాయి.జీతం: నెలకు ?19,288. కొంగర కలాన్, కేకే పార్క్, హైదరాబాద్. రొటేషనల్ షిఫ్ట్ విధానం, వారానికి ఒకరోజు సెలవు, ఉచిత భోజనం రవాణా సదుపాయం కలవు.

తీసుకురావాల్సిన పత్రాలు:

హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్



పాస్‌బుక్, విద్యార్హత సర్టిఫికెట్లు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం రాధిక (9059618521), నవీన్ (9398946830), లేదా మూర్తి (7842461759) లను సంప్రదించవచ్చని తెలిపారు. అర్హులైన నిరుద్యోగులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రంగంపేటలో కేత్ బచావో అభియాన్.. భూసార పరిరక్షణ.....

- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన.....

కొల్చారం, నవంబర్10(ప్రజా జ్యోతి)

మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు భూసార పరిరక్షణ, మట్టి నమూనాల సేకరణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు పొలాల్లో మట్టి నమూనాలను ఎలా సేకరించాలి, వాటిని భూసార పరీక్షల కోసం ఎలా పంపించాలి, పరీక్షల ద్వారా నేలలోని పోషకాల స్థాయిని ఎలా తెలుసుకోవచ్చనే విషయాలను వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగించడం వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువులను వినియోగించాలని సూచించారు. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచుకోవాలని, భూమి సహజ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రైతులకు వివరించారు. అలాగే వరి పంట కోతల అనంతరం మిగిలే వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థం, మిత్ర పురుగులు, సూక్ష్మజీవులకు నష్టం కలుగుతుందని తెలిపారు. వాటిని భూమిలో కలపడం ద్వారా భూసారం మెరుగుపడుతుందని వివరించారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా యాసంగి సీజన్‌లో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేయాలని సూచించారు. వరికి బదులుగా తక్కువ నీరు అవసరమయ్యే ఆరుతడి





పంటలైన జొన్న, మొక్కజొన్న, శనగ, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేయాలని వ్యవసాయ నిపుణులు సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ రైతులు లాభదాయకమైన పంటల వైపు మొగ్గు చూపాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఉమాకాంత్, డాక్టర్ సేవా నాయక్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్ రెడ్డి, కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేత, ఏఈఓ స్రవంతి, రంగంపేట ఉపసర్పంచ్ సురేష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా సర్పంచ్ సాయి కిరణ్ పంచాయతీ కార్మికుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం

మల్లేశం తల్లి మృతి పట్ల సంతాపం..

అందోలు నవంబర్ 10, (ప్రజాజ్యోతి):

కష్టసుఖాల్లో గ్రామ పంచాయతీ కార్మికుల కుటుంబాలకు అండగా నిలవాలన్న మానవీయ దృక్పథాన్ని సర్పంచ్ ఒగ్గు సాయి కిరణ్ చాటుకున్నారు. గ్రామ పంచాయతీ వర్కర్ పెద్దగొల్ల మల్లేశం తల్లి యాదమ్మ మృతి చెందడంతో స్పందించిన ఆయన, గ్రామ పంచాయతీ తరపున బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.గ్రామ పారిశుధ్యం, అభివృద్ధి పనుల్లో నిరంతరం సేవలందించే పంచాయతీ కార్మికుల కుటుంబాల్లో విషాదం చోటుచేసుకున్నప్పుడు వారికి అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావించారు. ఈ క్రమంలో మల్లేశం కుటుంబానికి ఆర్థిక చేయూత అందించడంతో పాటు మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కష్టకాలంలో కుటుంబానికి గ్రామ పంచాయతీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్, వార్డు సభ్యులు బోయిని శంకర్, తుకాపురం పూజిత నవీన్, ఒగ్గు మల్లేశం, ఒగ్గు దేవరాజు, గున్నాల సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



దైవం దృష్టిలో అందరూ సమానమే

హత్నూర 10 నవంబర్ (ప్రజాజ్యోతి)

మండలంలోని నస్తీపూర్ గ్రామంలో మంగళవారం రోజున పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి చందనోత్సవం నిర్వహించనైనది. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రమీల సాయిలు మాట్లాడుతూ మనుషులను సృష్టించిన దేవుని దృష్టిలో అందరూ సమానమే అన్నారు.కానీ మనుషులే కులాలు మతాలు సృష్టించుకుని ఒకర్ని ఒకరు తారతమ్యాలతో దూరం పెట్టుకోవడం జరుగుతుందన్నారు.దేవాలయాల సందర్శనలతో అందరూ కలిసి ఉండాలని సూచించారు.నస్తీపూర్ లో దళితులు ఆలయ ప్రదేశాలతో పాటు, భవానీ మాల, అయ్యప్ప స్వామి దీక్షలు తీసుకోవడం శుభపరిణామం అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీల సాయిలు, ఉపసర్పంచ్ మహేందర్, కార్యదర్శి యాదయ్య, వేద పండితులు మాణిక్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.



ఎండిపోయిన వరి పంటలకు ఎకరాకు

రూ.40 వేల నష్టపరిహారం అందించాలి

కరువు మండలాలుగా మెదక్ జిల్లాలోని అన్ని మండలాలను ప్రకటించాలి

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన తెలంగాణ రైతు రక్షణ సమితి





శివ్వంపేట ప్రజాజ్యోతి నవంబర్ 10:

మెదక్ జిల్లాలో ఎండిపోయిన వరి పంటలకు నష్టపరిహారం అందించడంతో పాటు,ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు,అవకతవకలను పరిష్కరించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా కార్యవర్గ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ను కోరారు.ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ అధ్యక్షతన కమిటీ సభ్యులు బృందంగా వెళ్లి జిల్లాలోని వివిధ మండలాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి,జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మైసయ్య యాదవ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎండిపోయిన వరి పంటలకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు నష్టపరిహారం అందించాలని కోరారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.యాసంగి సీజన్‌లో వరి పంటకు బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు అందించాలని,ప్రతి గ్రామ పంచాయతీలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.మెదక్ జిల్లాలో మొత్తం 21 మండలాలు ఉండగా,కేవలం మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించడం వల్ల మిగతా 20 మండలాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తేనే ప్రభుత్వ పరంగా రైతులకు అందాల్సిన సబ్సిడీలు,ఇతర సహాయ పథకాలు అందే అవకాశం ఉంటుందని వివరించారు.రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు మైసయ్య యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిరియాల చంద్రశేఖర్,జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి బోయిని రమేష్ యాదవ్,ముఖ్య సలహాదారు కొండ ఎల్లం యాదవ్,జిల్లా కార్యదర్శి నరేందర్,జిల్లా కార్యవర్గ సభ్యులు పరశురాం యాదవ్,పి.మల్లేష్, సిద్ధిరాములు యాదవ్,యేసయ్య,వంశీకృష్ణ తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ పిలుపు!

- అందోల్‌లో కొలువుల జాతర- ప్రముఖ ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలో ఉద్యోగాలు.. రూ.19 వేల వేతనం!

- యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం.. మంత్రి దామోదర్ చొరవ

అందోల్, నవంబర్ 10, (ప్రజా జ్యోతి):

చదువు పూర్తిచేసుకొని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా అందోల్ నియోజకవర్గంలో మరో మంచి అవకాశం అందుబాటులోకి రానుంది. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన భారీ జాబ్‌మేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ ఉద్యోగ ఎంపిక కార్యక్రమం జరగనుంది.

పదో తరగతి, ఇంటర్ అర్హతతో ఉద్యోగాలు

ప్రముఖ ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలో అసెంబ్లీ ఆపరేటర్ ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన 18 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు అర్హులుగా ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.19,288 వేతనం అందించనున్నట్లు వెల్లడించారు. పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సదుపాయాలు కూడా కల్పించనున్నారు. రొటేషనల్ షిఫ్ట్ విధానంలో పని చేయాల్సి ఉండగా, వారానికి ఒకరోజు సెలవు ఉంటుంది. ఉచిత భోజనం, ఉచిత రవాణా సౌకర్యాలు కూడా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

స్థానిక యువతకు ఉపాధి బాట

ఉద్యోగాల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి అవకాశాలు వెతుక్కుంటున్న గ్రామీణ యువతకు ఇలాంటి జాబ్‌మేళాలు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. కనీస విద్యార్హతతోనే ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా నిరుద్యోగ యువతకు ఆర్థిక స్వావలంబన సాధించే అవకాశం లభించనుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

యువతకు ఉపాధి.. మంత్రి ప్రత్యేక చొరవ

నియోజకవర్గ అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక దృష్టి సారించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పరిశ్రమల ద్వారా ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం నిరుద్యోగ సమస్య పరిష్కారానికి దోహదపడనుంది. ఈ నేపథ్యంలో అర్హులైన యువత



పెద్ద సంఖ్యలో జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాలను పొందాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు ఇది మంచి అవకాశం. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కళాశాలలో జరిగే జాబ్‌మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

భూ వివాదాల్లో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే

చర్యలు తప్పవు

- చట్టబద్ధంగా సమస్యలను పరిష్కరించుకోవాలి:

రాయికోడ్ ఎస్‌హెచ్‌ఓ చైతన్య కిరణ్

రాయికోడ్ నవంబర్ 10 (ప్రజా జ్యోతి):

భూ వివాదాలకు సంబంధించి ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని ఎస్‌హెచ్‌ఓ చైతన్య కిరణ్ సూచించారు. మండల ప్రజలను ఉద్దేశించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.భూముల సరిహద్దులు, పట్టా సమస్యలు, వారసత్వ హక్కులు, భూ ఆక్రమణలకు సంబంధించిన వివాదాలను స్వయంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించ కూడదన్నారు.ఇలాంటి సమస్యలపై సంబంధిత రెవెన్యూ అధికారులను లేదా న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయబద్ధంగా పరిష్కరించు కోవాలని సూచించారు.భూ వివాదాల పేరుతో దాడులకు పాల్పడటం,బెదిరించడం,అక్రమంగా భూముల్లోకి ప్రవేశించడం, పంటలు, ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.భూ వివాదాల కారణంగా శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉన్నప్పుడు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) 2023లోని సెక్షన్ 126 ప్రకారం బైండోవర్ చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.భూమి లేదా నీటి వివాదాల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితుల్లో సెక్షన్ 164 ప్రకారం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.అలాగే నేర స్వభావాన్ని బట్టి భారతీయ



న్యాయ సంహిత (బీఎన్ఎస్) 2023లోని సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు సంయమనం పాటిస్తూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని, భూ వివాదాల విషయంలో గొడవలకు దిగకుండా చట్టాన్ని గౌరవించాలని ఎస్‌హెచ్‌ఓ చైతన్య కిరణ్ కోరారు.

నల్గొండలో 15న రైతు బహిరంగ సభ జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరం మల్లేష్

జహీరాబాద్, నవంబర్ 10(ప్రజా జ్యోతి న్యూస్)

నల్గొండలో ఈనెల 15వ తేదీన రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలని, అఖిలభారత రైతు సంఘం (ఏఐకేఎస్) జాతీయ మహాసభలను జయప్రదం చేయా లని ఈ బహిరంగ సభకు రైతులు వ్యవసాయ కూలీలు కార్మికులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరం మల్లేష్ పిలుపునిచ్చారు. మంగళ వారం జహీరాబాద్ లో జరిగిన సిపిఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ దేశంలో రైతులు కూలీలు ప్రజలు కార్మికులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలపై ఉద్యమాలు పోరాటాలు జరుగుతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమాల గడ్డ నల్లగొండలో జరుగుతున్న ఏఐకేఎస్ అఖిలభారత మహాసభల సందర్భంగా జరిగే లక్షలాది మంది రైతుసభలో జహీరాబాద్ నుండి కూడా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జహీరాబాద్ ఏరియా కార్యదర్శి రామచందర్ కమిటీ సభ్యులు ఎస్ మహిపాల్ నర్సయ్య వీరయ్య గౌడ్ సంగన్న దశరథ్ చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదం అంచున విద్యుత్ స్తంభం..

రోడ్డువైపు ఒరిగిన కరెంటు స్తంభం.. వాహనదారుల్లో ఆందోళన

ప్రమాదం జరిగేలోపే స్పందించాలంటున్న గ్రామస్తులు

వెల్దుర్తి, (ప్రజాజ్యోతి) నవంబర్ 10:

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శెట్టిపల్లి కలాన్ గ్రామ శివారు పరిధిలో విద్యుత్ శాఖ అధికారుల తక్షణ దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ శివారులో రోడ్డుకు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం ఒకవైపు తీవ్రంగా ఒరిగి ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉండటంతో అటువైపు రాకపోకలు సాగించే వాహనదారులు, స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.నిత్యం వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే మార్గం కావడంతో ఒరిగిన విద్యుత్ స్తంభం ఎప్పుడు ప్రమాదానికి కారణమవుతుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బలమైన గాలులు, వర్షాలు వచ్చిన సమయంలో స్తంభం కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.ప్రజల భద్రతకు సంబంధించిన ఇలాంటి సమస్యలపై ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే అప్రమత్తం కావాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులపై ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని వెంటనే





సరిచేయడంతో పాటు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.ప్రాణనష్టం జరిగాక స్పందించడం కంటే, ప్రమాదం జరగకముందే నివారించడం మేలు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కల్వేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేను ?

- ఐదేళ్లుగా అసంపూర్తిగా నిర్మాణ పనులు..

పాత భవనంలోనే విద్యార్థుల చదువులు

- విద్యార్థుల భవిష్యత్తుతో

చెలగాటం ఆడుతున్న అధికారుల నిర్లక్ష్యం

కల్వేర్,నవంబర్ 10,ప్రజాజ్యోతి:

కల్వేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులు దాదాపు ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన భవనం అందుబాటులోకి రాకపోవడంతో జడ్పీహెచ్ఎస్ పాత భవనంలోనే కళాశాల తరగతులు కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు.ఏళ్ల తరబడి నిర్మాణ పనులు నిలిచిపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. కళాశాల భవనం పూర్తవుతుందని ఆశించిన విద్యార్థులు, తల్లిదండ్రులకు నిరాశే మిగులుతోంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించి, నిలిచిపోయిన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కళాశాల నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



ఈద్గా మైదానంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

- మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ చొరవతో కొత్త బోరు ఏర్పాటు

- ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ సహకారంతో ఈద్గా కమిటీకి ఊరట





జహీరాబాద్ నవంబర్ 10(ప్రజా జ్యోతి న్యూస్)

జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానంలో ఏర్పడిన నీటి కొరత సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ప్రత్యేకచొరవ తీసుకున్నారు. ఈద్గా కమిటీ పెద్దలు తమ మైదానంలో నీటి కొరత ఏర్పడుతుందని, దీనివల్ల ప్రార్థనలకు వచ్చే ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య పై వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, తోటి కౌన్సిలర్లతో చర్చించి, ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ తో మాట్లాడి ఈద్గా మైదానంలో నెలకొన్న నీటి సమస్యను వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎంపీ సహకారంతో తక్షణ చర్యలు చేపట్టి మంగళవారం ఈద్గా మైదానంలో కొత్త బోరు ఏర్పాటు చేయించారు. కొత్త బోరు ఏర్పాటు చేయడంతో ఈద్గా మైదానంలో నీటి కొరత సమస్యకు ఉపశ మనం లభించనుంది. ముఖ్యంగా ప్రార్థనల సమయంలో మైదానా నికి వచ్చే ప్రజలకు నీటి సౌకర్యం అందుబాటులోకి రావడంతో ఈద్గా కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈద్గా కమిటీ పెద్దలు, సభ్యులు మాట్లాడుతూ... తమ సమస్యను మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి, ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ తో మాట్లాడి కొత్త బోరు ఏర్పాటు చేయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణమే స్పందించి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన చైర్మన్ కి, కౌన్సిలర్లకు ఇందుకు సహకరించిన ఎంపీ సురేష్ కుమార్ షేట్కర్ కి ఈద్గా కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజా ప్రతినిధులు చొరవ చూపడం పట్ల పట్టణ ప్రజలు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జహంగీర్, జమీలుద్దీన్, నిజాముద్దీన్, అక్రమ్, ఖదీర్, రఫీ ఈద్గా కమిటీ సభ్యులు మజీద్, ఇనాయత్, మోయిజ్, ఇసమొద్దీన్, ముజా హిద్, స్థానిక నాయకులు, ప్రజాప్రతి నిధులు ఇతరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనము పి ఎఫ్ ఈ ఎస్ఐ అమలు చేయాలి

నవంబర్ 10 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

ఆశా వర్కర్ల కు ఫిక్స్డ్ వేతనం రూ.,18,000/ లు ఇవ్వాలని, పీ ఎఫ్, ఈ.ఎస్.ఐ అమలు చేయాలని,ప్రమాద భీమా 50/ లక్షలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మెదక్ ఎం ఎల్ ఏ కార్యాలయం లో గంగాధర్ కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా కోశాధికారి కే నర్సమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్లు 20 సంవత్సరాలుగా పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఫిక్స్డ్ వేతనం నిర్ణయించ కుండా పారితోషికాలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తున్నట్లుగా ఆమె అన్నారు. ఎంత పని చేసినప్పటికీ ఒకవేళ చనిపోతే కనీసం మత్తికర్చులు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.2023 సంవత్సరంలో ఆశా వర్కర్లు తమ సమస్యల పై సమ్మె చేస్తున్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని,ఆశలకు ఫిక్స్డ్ వేతనం రూ .,18,000/ లు నిర్ణయించి అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని 2 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి కైన ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్ల సమస్యల సాధన కమిటీ నాయకత్వం తో చర్చించి ఆశా డిమాండ్ల పరిష్కరించాలని , లేకపోతే 2026బి డిసెంబర్ 15వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగుతుందని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి సావిత్రి, జిల్లా నాయకులు రాణి, పెంటమ్మ,స్వప్న, సుజాత, సావిత్రి, దేవమ్మ,



లక్ష్మి, కవిత,మంజుల ,పుష్ప, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది

- ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

- రింగ్‌రోడ్డు పేరుతో రూ.1.65 కోట్ల నిధులపై అనుమానాలు

- పనులపై సమగ్ర విచారణ జరిపించాలి - మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి

కల్హేర్ నారాయణఖేడ్, 10.నవంబర్ ప్రజాజ్యోతి:

ఎన్నికల సమయంలో అనేక హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణఖేడ్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డిశ్రీ భూపాల్ రెడ్డి విమర్శించారు. నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పనితీరుపై విమర్శలు గుప్పించారు.రెండుసార్లు ముఖ్యమంత్రి సంగారెడ్డి జిల్లాకు వచ్చినప్పటికీ నారాయణఖేడ్‌కు ప్రత్యేకంగా సాధించిందేమిటని ప్రశ్నించారు. పర్యటనలు, ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. నారాయణఖేడ్ రింగ్‌రోడ్డు పేరుతో ఉపాధి హామీ పథకం నిధుల దుర్వినియోగం జరుగుతోందని ఆరోపించారు. బానాపూర్ గ్రామానికి రూ.25 లక్షలు, జి. హుక్రానకు రూ.80 లక్షలు, వెంకటాపూర్‌కు రూ.60 లక్షలు కలిపి మొత్తం రూ.1.65 కోట్ల పనులపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. పనులు ఎక్కడ, ఎంతమేరకు జరిగాయో అధికారులు స్పష్టం చేయాలని, పనులు చేయకుండానే రికార్డులు నమోదు చేసి ఉంటే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రింగ్‌రోడ్డు అంటే పట్టణం చుట్టూ పూర్తిస్థాయిలో నిర్మించాల్సి ఉంటుందని, అక్కడక్కడ 20



అడుగుల వెడల్పుతో రోడ్లు వేసి రింగ్‌రోడ్డు అని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రిని ఒప్పించి పట్టణం చుట్టూ 100 అడుగుల వెడల్పుతో నాణ్యమైన రింగ్‌రోడ్డు నిర్మాణానికి నిధులు తీసుకురావాలని సవాల్ విసిరారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నారాయణఖేడ్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసి పట్టణ అభివృద్ధికి పునాది వేశామని తెలిపారు. మున్సిపాలిటీకి అందించిన జేసీబీలు, పారిశుద్ధ్య యంత్రాలను ప్రజా అవసరాలకు కాకుండా ప్రైవేటు పనులకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, వాటిని ప్రజా ప్రయోజనాలకే ఉపయోగించాలని అన్నారు.మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించిన



తమ ప్రభుత్వ హయాంతో పోలిస్తే ప్రస్తుతం వారం రోజులకోసారి కూడా నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని విమర్శించారు. ప్రజలకు కనీస తాగునీటి సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజాధనాన్ని ఒక్క రూపాయి దుర్వినియోగం చేసినా బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తుందని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, మున్సిపల్ కౌన్సిలర్ విజయ్ బుజ్జి, సర్పంచులు వెంకటేశం, రాజు, మాజీ ఎంపీటీసీ ముజామిల్, మాజీ సర్పంచులు రాజు నాయక్, రవి నాయక్, నాయకులు వెంకట్ నాయక్, సర్దార్ నాయక్, మల్గొండ, చింటూ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావ నివారణ పనులు చేపట్టాలి

- వీబీజీ--రాంజీ పథకం పనులపై మేట్లకు శిక్షణ

- కూలీల హాజరు శాతం పెంచి

జిల్లాలో ప్రథమ స్థానం సాధించాలి: గురుపాదం



కల్హేర్,10..,నవంబర్ ప్రజాజ్యోతి:

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో కరువు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున వీబీజీ--రాంజీ పథకం కింద వర్షాభావ నివారణ పనులు చేపట్టాలని కల్హేర్ ఎంపీడీవో గురుపాదం సూచించారు. మంగళవారం కల్హేర్‌లో పథకం అమలుపై మేట్లకు



శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతల నిర్మాణం తదితర నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కూలీల హాజరు శాతం పెంచి జిల్లాలో మండలానికి ప్రథమ స్థానం సాధించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ వేణుమాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

కామును చెరువు పంట కాల్వలో పూడికతీత

- వీబీజీ--రాంజీ పథకం కింద పనులు



రైతుల హర్షం వ్యక్తం చేయడం జరిగింది కారణం

కల్హేర్‌లోని కామును చెరువు పంట కాల్వలలో మంగళవారం వీబీజీ--రాంజీ పథకం కింద కూలీలు పూడికతీత పనులు చేపట్టారు. కాల్వలో పూడిక పేరుకుపోవడంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎట్టకేలకు పూడిక తొలగింపు పనులు ప్రారంభం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులను ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ పరిశీలించారు.